క్లుప్తంగా...

నేడు గండిపేటలో స్వచ్ఛ ర్యాలీ

మణికొండ: ఇండియన్ స్వచ్ఛతాలీగ్ కార్యక్రమంలో భాగంగా నేడు గండిపేట వార్డు కార్యాలయం నుంచి గండిమైసమ్మ దేవాలయం వరకు స్వచ్ఛర్యాలీని నిర్వహిస్తున్నామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 7గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్, చెత్తను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక పూజలు


పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రాంతంలోని రాందేవ్ బాబా దేవాలయం ఆవరణలో యజ్ఞ పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాందేవ్‌బాబా జయంతి సందర్భంగా యజ్ఞ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 108, సాయంత్రం 108 జంటలు ఈ యజ్ఞ మహోత్సవంలో పాల్గొంటున్నారు. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో దేవాలయం కిటకిటలాడుతోంది.

నేడు అయోధ్య రామపాదుకలు రాక

మణికొండ: అయోధ్య రామమందిరంలో పూజలందుకుంటున్న రామపాదుకలు ఆదివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, ఎంజీ పార్కులో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి వస్తున్నాయని టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ ప్రకటించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినాయక మండపంలో భక్తులు దర్శించుకోవచ్చని సూచించారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేస్తున్న వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మనం చేసే రక్తదానం అనేక మంది ప్రాణాలను నిలుపుతుందని, ప్రతి ఆరు నెలలకోసారి అర్హత ఉన్న వారు రక్తదానం విధిగా చేయాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ రోడ్డు నెంబర్ 13 సర్కిల్‌లో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను ఇలాంటి మంచి కార్యక్రమాలకు వినియోగించుకోవటం శుభపరిణామన్నారు. పెద్దఎత్తున ఐటీ ఉద్యోగులు, స్థానికులు రక్తదానం చేయటంతో పాటు వైద్యసేవలను పొందారు. కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, ధాన్వీహెల్త్ కేర్ సీఈఓ కె.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, నీలేష్‌ప్రసాద్ తదితరులున్నారు.

కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: పరిగి మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ కొప్పుల హరీశ్వర్ రెడ్డి పార్థివదేహానికి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు నివాళులర్పించారు. హరీశ్వర్ రెడ్డి కుమారుడు, పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

గచ్చిబౌలి: 67వ రంగారెడ్డి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌ను జిల్లా విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. శనివారం కొండాపూర్ చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, అండర్–17 కబడ్డీ స్కూల్ గేమ్స్‌లో 510 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎనిమిది జోన్లుగా విభజించి స్కూల్ గేమ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కోసం జట్టును ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో చిరాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇఫాత్ ఇబ్రహీం, శేరిలింగంపల్లి జోనల్ సెక్రటరీ భిక్షపతి, సుజన తదితరులు పాల్గొన్నారు.

మా గల్లీకా గణేష్.. గణపతి బప్పా మోరియా

రాజేంద్రనగర్‌జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం భక్తులు వినాయక మండపాల వద్ద ఉత్సాహంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, స్థానికులు వివిధ బస్తీలు, కాలనీలు, గల్లీల్లోని గణపయ్యను దర్శించుకున్నారు.

– రాజేంద్రనగర్‌జోన్ బృందం


సిద్ధాంతిలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్


పుప్పాలగూడలో అన్నదానంలో వైస్‌చైర్మెన్ నరేందర్‌రెడ్డి


మణికొండ పోచమ్మ కాలనీలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి


మాజీ సర్పంచ్ యాలాల నరేష్, అంబేద్కర్ యూత్ నాయకులు


బుద్వేల్‌లో గణనాథుని వద్ద భక్తులు


న్యూ భవానీ కాలనీలో..


ఎంజీపార్కు వినాయకుడి వద్ద సరస్వతీ పూజలో చిన్నారులు


రాఘవేంద్రకాలనీ వినాయక పూజలో కౌన్సిలర్లు, నాయకులు


కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి మెమొంటో అందజేత

ప్రజల సహకారంతోనే స్వచ్ఛతలో మెరుగైన ఫలితాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతూ స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో మెరుగైన ర్యాంకు కోసం అడుగులు వేస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా జేఎస్ఎస్ఆర్‌యూఎంలో తడి, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అధికారులకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సుభాష్, నరేందర్, రామాంజులు, యాదగిరి, స్వచ్ఛ సర్వేక్షణ్ ఇన్‌చార్జి స్వరూప్ తదితరులున్నారు.


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషిస్తాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ 3వ డివిజన్‌లోని న్యూ మాధవిర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నేరాలను అదుపు చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, కుమార్‌యాదవ్, సదానంద్‌గౌడ్, సంగీతం దశరథ్, భూపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు, కాలనీసభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

అత్తాపూర్: సోదరభావంతో సాంప్రదాయంగా వస్తున్న పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్న ముస్లిం, హిందూ సోదరులకు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈనెల 28న గురువారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులు జులూస్‌ను నిర్వహిస్తారని, అదే రోజు వినాయక నిమజ్జనం జరుగుతుండటంతో రెండు పండుగలను ఒకేరోజు నిర్వహిస్తే ఇరువురికి కరెక్ట్‌గా ఉండదని భావించిన నగర పోలీసు యంత్రాంగం సూచనల మేరకు హిందూ, ముస్లిం మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో అంగీకరించిన మత పెద్దలు అక్టోబర్ 1న నిర్వహించుకుంటామని అంగీకరించడంతో మన సంస్కృతి సాంప్రదాయాలకు గౌరవంగా ఉందని డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వారిని అభినందించారు. రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సైలు నాగరాజు, వెంకన్న, శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు


వెంకట్‌రెడ్డికాలనీలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ శాశ్వత ప్రాతిపదిక పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని వెంకట్‌రెడ్డికాలనీలో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ సీసీ రోడ్డు పనులను సంబంధిత అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు డ్రైనేజీ సమస్యలు లేకుండా చేయాలని దశలవారీగా అన్ని కాలనీలు, బస్తీలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు వేసిన తర్వాతనే డ్రైనేజీ కాలువల పనులను చేపట్టాలని, ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని ఆయన సూచించారు. చేపట్టిన ప్రతి పనిలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారని గుర్తు చేశారు.

అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్..

శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్ లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. అక్కడ ప్రతియేటా వర్షాకాలంలో తలెత్తే సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూమిలోనుంచే రోడ్డు

శంషాబాద్: అసైన్డ్ పొలాల వైపు ప్రజలు వెళ్లేదారి కోసం ఇరువైపు తొలగించిన చెట్లతో తమపై తప్పుడు కేసు బనాయించారని గొల్లపల్లి కౌన్సిలర్ చెన్నం అశోక్ అన్నారు. ప్రత్యర్థులు చేసినవి పూర్తి తప్పుడు ఆరోపణలు మాత్రమేనన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సమీపంలో ఉన్న అసైన్డ్ పొలాలకు వెళ్లేదారి కూడా ప్రభుత్వానికి చెందినదేనని వివరించారు. అసైన్డ్ పొలాలకు ప్రభుత్వ భూమిలోంచి వెళ్లేందుకు చేపడుతున్న చర్యలపై తప్పుడు ప్రచారాలు చేయడంతో పాటు తప్పుడు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. స్థానిక నిరుపేద ప్రజల డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు కోసం ఇప్పటికే సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్డును ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ముందుకెళ్తున్నామన్నారు.

వ్యవసాయ రసాయన పరిశ్రమలో నగరం కీలకం

సాక్షి, సిటీబ్యూరో: అగ్రో కెమికల్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ నగరంలోని కొండాపూర్‌లో ఉన్న ఏషియన్ సన్ సిటీలో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీనిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణులు మాట్లాడుతూ... దేశంలోని మొత్తం వ్యవసాయ రసాయన వ్యాపారంలో నగరంతో పాటు దక్షిణ మండలం 35 శాతం వాటాను కలిగి ఉందని వెస్ట్ జోన్‌కు సెంట్రల్ హబ్‌గా కూడా నగరం కీలక స్థానాన్ని కలిగి ఉందని వివరించారు.

జీఎన్ఐటీఎస్‌లో ఆకాథాన్

గోల్కొండ: తమ కళాశాలలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో బోధన జరుగుతుందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎస్ఐహెచ్ ఇంటర్నల్ ఆకాథాన్ నిర్వహించారు. ఈ ఆకాథాన్‌లో 110 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో 30కిపైగా హార్డ్‌వేర్ సొల్యూషన్స్, 80కిపైగా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ఆకాథాన్‌లో తమ కళాశాలకు చెందిన ఎందరో ఔత్సాహిక విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని ప్రిన్సిపాల్ అన్నారు.

కొట్టేశారు.. వదిలేశారు

మణికొండ: విద్యుత్ వైర్లకు అడ్డుతగులుతున్న కొమ్మలను ప్రతి వర్షాకాలం ముందే విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందిని పెట్టి కొట్టివేయిస్తున్నారు. కొట్టిన కొమ్మలను తీసేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పక్కన ఉన్న కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని వెంటనే వాటిని తొలగింపజేయాలని పలు కాలనీల వాసులు కోరుతున్నారు.


అలకాపూర్ టౌన్‌షిప్‌లో కొట్టివదిలేసిన చెట్ల కొమ్మలు

ఘనంగా మంత్రి మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బండ్లగూడ: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి భారీకేక్‌ను కట్ చేయించారు. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు అస్లాం బిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఖాజా తదితరులున్నారు.

శంషాబాద్: మంత్రి మహేదర్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి మహేందర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నగరానికి స్మార్ట్‌బైక్ సంస్థ సైకిళ్లు

మణికొండ: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వారీగా 23 కిలోమీటర్ల దూరం ఏర్పాటు చేసిన సైకిల్‌ట్రాక్‌లో సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లను అద్దెకు ఇచ్చే టెండర్‌ను స్మార్ట్‌బైక్ దక్కించుకున్నట్టు సంస్థ ఎండీ ధర్మిన్ దొంతంశెట్టి ప్రకటించారు. దేశంలో 100 స్మార్ట్ సిటీల్లో మొబిలిటీ, ఈ– గవర్నెన్స్ కేటగిరి కింద స్మార్ట్‌బైక్ ఇప్పటికే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. చండీగఢ్ పబ్లిక్ బైక్ షేరింగ్ ప్రాజెక్ట్‌కు భారత ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ద్వారా ఈ అవార్డును ఈనెల 27న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఇండోర్‌లో అందజేస్తున్నారన్నారు. నానక్‌రాంగూడ నుంచి పోలీస్ అకాడమీ, నార్సింగి నుంచి కొల్లూరు వరకు ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌పై ప్రొవిజన్, ఆపరేషన్ కోసం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ నిర్వహించిన టెండర్‌లో తమ సంస్థ దక్కించుకుందన్నారు. హైదరాబాద్‌లోని సైక్లింగ్ ట్రాక్‌కు అనుగుణంగా స్మార్ట్‌బైక్ సంస్థ అత్యాధునిక స్మార్ట్‌బైక్‌లను అందిస్తున్నామన్నారు.



నగరానికి రానున్న స్మార్ట్‌బైక్ సంస్థ సైకిళ్లు

జాతీయ రహదారిపై వాహనాలు ఢీ..

- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపిన పోలీసులు

శంషాబాద్: పట్టణంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సుమారు 3 గంటల పాటు ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున ఉదయం 4.30 గంటలకు ఎయిర్‌పోర్టు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ కట్టమైసమ్మ ఆలయం సమీపంలో ఉన్న మలుపు వద్ద ఒక్కసారిగా అవతలి రోడ్డువైపు వెళ్లి శంషాబాద్ వెళుతున్న ఓ కారును ఢీకొంది. అప్పుడే శంషాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న భారీ ఇసుకలోడు టిప్పర్ కంటైనర్ మధ్యలోకి దూసుకుపోయింది. ఇసుకలారీలో ఉన్న డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డగా మూడు వాహనాలు నిలిచిపోవడంతో జాతీయరహదారిపై సుమారు రెండు గంటల పాటు భారీ ఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు పోలీసులు నానా తంటాలు పడుతున్నారు. ఎయిర్‌పోర్టు వైపు నుంచి వస్తున్న వాహనాలను ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పక్క నుంచి సర్వీసు రోడ్డు మార్గం గుండా సింప్లెక్ రహదారి వైపు మళ్లించారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


జాతీయరహదారిపై నిలిచిపోయిన వాహనాలు


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

సోలార్ ప్లాంట్ ప్రారంభం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రోజురోజుకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ.. రాష్ట్రంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుస్తుందని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ గిరిధారి అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన 100 కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిధారి అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రజలకు కావాల్సిన సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఖాజా తదితరులున్నారు.

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి

అత్తాపూర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి చేరవేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ హనుమాన్‌నగర్ కాలనీ, ఇందిరానగర్ చౌరస్తా, హైదర్‌గూడ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధిలో ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకులు మొండ్ర కొమరయ్య, కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్, డాక్టర్ అమరేందర్, వనం శ్రీరామ్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, ప్రియంరెడ్డి, చిన్న, వెంకటేష్, జాలిగం చిత్తారి తదితరులున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

చింతకుంట పార్కు సందర్శన

అత్తాపూర్: పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో విలసిల్లాల్సిన చింతకుంట పార్కు చీకటి పడకముందే సంఘ విద్రోహ శక్తులకు అడ్డాగా మారుతుందని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీత ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆమె అధికారులతో కలిసి చింతకుంట పార్కును సందర్శించారు. కార్పొరేటర్‌తో పాటు జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్‌గౌడ్, అసిస్టెంట్ ఇంజినీర్ మూర్తి తదితరులు పర్యటించారు. వర్షం తాకిడికి కూలిపోయిన ప్రహరీగోడలు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వేలాది మందికి స్వచ్ఛమైన వాతావరణం అందిస్తూ.. శారీరక వ్యాయామం కోసం ఉపయోగపడుతున్న చింతకుంట పార్కు డ్రైనేజీ నీటి ప్రవాహంతో మురికికూపంగా మారుతుందన్నారు. యుద్ధప్రాతిపదికన నూతన డ్రైనేజీ పైపులైన్ వేయాలని ఆమె అధికారులను కోరారు. పార్కు అభివృద్ధికి, వ్యవస్థను పటిష్ట పరచడానికి వేగంగా చర్యలు తీసుకుంటామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్‌గౌడ్ హామీ ఇచ్చారు. సీనియర్ పాత్రికేయులు మేడం మధుసూదన్, గుడ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శెట్టిగారి శేఖర్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి అడ్వాన్స్‌డ్ ఎంబ్రాయిడరీ మిషన్

లీ మెరిడీయన్‌లో ప్రారంభించిన సినీ నటి శ్రియ శరణ్

గచ్చిబౌలి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే హెచ్ఎస్‌డబ్ల్యూ 5జీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంబ్రాయిడరీ మిషన్ సినీ నటి శ్రియ శరణ్ ప్రారంభించారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్ హోటల్‌లో హెచ్ఎస్‌డబ్ల్యూ 5జీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంబ్రాయిడరీ మిషన్‌ను ఆమె మార్కెట్‌లోకి విడుదల చేశారు. హెచ్ఎస్‌డబ్ల్యూ సీఈఓ తపన కపాడియా... మాట్లాడుతూ మహిళలకు మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ ఎంబ్రాయడరీ మిషన్ దోహదం చేస్తుందన్నారు. ఎనిమిది దేశాలలో, 22 రాష్ట్రాలలో మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆయన ప్రకటించారు. సరికొత్త డిజైన్లను రూపొందించి మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సినీ నటులు సుధీర్ రాగని, వై.విజయమ్మ, గిరేష్ పాల్గొన్నారు.

